

# టేకిట్ ఈజీ!! - 3

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





## -5-

## టూ విషెస్

అన్నసారం అప్పుడే వంట పడుతోంది. కిటికీలోంచి వాలుగా "ఏక్ లడ్ కో దేఖా తో" పాటలో లాగా నీరెండ పడుతోంది. ఫేన్ వయ్యరంగా చుట్లు తిరుగుతూ నా శరీరం మీద వున్న కాస్త తెలివినీ "ఉఫ్ఫూ ఉఫ్ఫూ" మని  ఉదేసి, అలా అలా పాండ్స్ పౌడర్లాంటి మత్తుని జల్లేస్తోంది. లంచి లో ఆరగించిన శాకపాకాలు కడుపులో కుదురుకుని మంద్రస్థాయిలో "ఆకాశవాణి వారి మధ్యాహ్నం కచేరి" చేస్తూ, మధ్యమావతి పాడుతున్నాయి. కళ్ళు ముప్పావు వంతు మూసుకున్నాయి. మిగిలిన బేలన్సు బరువుగా చూస్తూ, "ఘర్షణ" లో నీరోషా కళ్ళలా హెవీగా వున్నాయి.

అప్పుడు నాముందో లేడీస్ ప్రత్యక్షమైంది. మూడు ఆకుపచ్చ కత్తులతో నా మీదకి దూసుకొచ్చింది. ఉలిక్కిపడి గబుక్కున కళ్ళిప్పాను. మా లేడీసే, తమలపాకు పేరెట్స్ చుట్టుకుని వచ్చింది. మనకి మత్తులో అవి కత్తుల్లాగ...అదన్నమాట సంగతి. ఇంతకీ ఆ వెజిటేరియన్ పేరెట్స్ ని అమాంతం నవిలేసి, డ్రాకులా డబ్బింగ్ సినిమాలాగా ఎర్రటి నోటితో లేచి

"ఇప్పేంచె వచ్చే ఇయ్యా" అన్నాను బ్రహ్మదేవుడికి కూడా అర్థం కాని భాషలో.

ఆవిడ నన్నాపి "ముందవి మింగి అప్పుడు మాట్లాడండి. మూడు తెస్తే ఒహటి తిని, ఒహటి తినిపించి, మూడోది ఆనక్కి దాచుకుంటారు ఎవరైనాను. మనమూ వున్నాం. ఉత్త బొక్కుడు గొడ్డు." అంది స్లైట్ గా చిరాకు అభినయిస్తూ.

ఇంతలో నేను మింగడం పూర్తిచేసి "నా మట్టిక్కి నేను భోంచేసి, పక్కెక్కి తొంగుంటే, ఆకులునోట్లో కూరి, పైగా గొడ్డంటావా? నిన్నూ..." అంటూ ఆవిడి పీకి పిసికెయ్యడానికి రెడీ అవుతుంటే, అడ్డంకొట్టి " పిసుకుదురుగాని కానీ, ముందు ఏమన్నారో చెప్పండి" అంది.

"ఏవీ లేదు, ఇప్పుడేంటే వచ్చావు, ఇలాగ అని అడిగాను" అన్నాను వివరిస్తూ.

"బావుంది, అప్పుడూ రాక, ఇప్పుడూ రాక ఇంకెందుకూ సంసారం?" అంది మాయాబజార్ లో ఛాయాదేవిలా సిగ్గుపడుతూ.

"అంటే, ఇప్పుడు మనం మళ్ళీ సంసారం చెయ్యాలా?" అన్నాను హాశ్చర్యంగా.

"ఛీ ఊరుకోండి, ఓ మాటా, ఓ మంతీ బొత్తిగా పూజ్యం అయిపోయాయి మీకు. ఇన్ని చేసి పెట్టానా, పులుసులో చిలకడ దుంపలు వేసానా? ఆఖరికి చిలకలు కూడా తెచ్చి కూరేనా? మరి ఓ మాటు మెచ్చుకుంటే మీ సొమ్మేంపోయిందండీ?" అంది గోముగా.

"ఓ అద్దా, మెచ్చుకోవడం అంటే, మరి, ఆ, ఆనక లేచాకా టీ కూడా ఇచ్చాకా తాగి, అప్పుడు తీరిగ్గా మెచ్చుకుందామని ఊరుకున్నానన్నమాట" అన్నాను  గేరెంటీ నవ్వొకటి నవ్వుతూ.

ఆవిడ అదను చూసుకుని అంకపీఠం అలంకరించేసింది. ఇలాంటి సమయాలలో మహా మహా మహారాజులు మటాష్ అయిపోయారు, వీక్ నెస్ లో పడిపోయి. అంచేత ఎక్కడి మత్తు అక్కడ దుప్పట్లో కూరేసి, ఆవిడచెప్పే మాటలకోసం అటెన్షన్ గా వింటున్నాను. ఆవిడ మొదలెట్టింది.

"ఏవండీ మీకు గుర్తుందా?" అని.

నేను ఆపి "నా నడ్డిమీద నాలుగే వాతలున్నాయి, అంచేత నీదీ, పిల్లలిద్దరిదీ బర్త్డేలు, మన పెళ్ళి డే తప్ప అన్యమైనవి ఏవీ గుర్తుండవన్నమాట" అన్నాను నడ్డి రాసుకుంటూ.

"అది కాదండీ, ఇదివరకు దేవ దానవ యుద్ధంలో ఇంద్రుడు మీ సహాయం అడిగినప్పుడు మనిద్దరం లూనా మీద అమరావతి వెళ్ళి ఫైట్ చేసాం గుర్తుందా. అప్పుడు మీరు యుద్ధం మజ్జెలో బ్రేక్ వైర్ తెగి పోయిందని బాగు చేసుకుంటూంటే, ఇద్దరు రాక్షసులు మీమీద ఆయుధాలు వేస్తుంటే నేను శంకరాభరణంలోంచి రెండు పాటలు పాడి వాళ్ళని ఛంపేసాను గుర్తుందా? అప్పుడు మీరు నాకు రెండు వరాలిస్తానన్నారు, కావలిసినప్పుడు కోరుకోమన్నారు?" అంది గుర్తుచేస్తూ.

"అవునా, అలా అన్నానా. ఏదో లూనా పాడైందన్న ఖంగారులో అనుంటాను, నువ్వు అవన్నీ మనసులో పెట్టుకోకు" అన్నాను లాలిస్తూ.

"హబ్బ, వినండి. నాకు ఇప్పుడా వరాలు కావాలి. ఇవ్వాల్సిందే. లేకపోతే ఆడి తప్పిన దోషం అంటుకుంటుంది." అంది భయపెడుతూ.

"ఓసీ పాతకీ, నీ కొడుకుకి పట్టాభిషేకం, నా కొడుక్కి చత్తీస్ ఘడ్ అడవులా? కుదరదు. కావస్తే వాళ్ళిద్దరినీ ఫొమ్మను అడవులకి. నువ్వుకూడా ఫో. ఫోయి వాళ్ళకి ఆవపెట్టి కూరలూ, పచ్చి పులుసులూ వండిపెట్టు. నేను హాయిగా ఇంట్లో వుండి కౌన్ బనేగా మేరీ పతీ, మీలో ఎవరు లంకేశ్వరుడు" ప్రోగ్రాములు చూసుకుంటాను. పధ్నాలుగేళ్ళయ్యాకా మీరొచ్చి టీ.వీ కట్టేసి నాకు టెక్స్ట్ చెయ్యండి" అన్నాను ఆవేశంగా.

"అబ్బ ఊరుకోండి మీగోలా మీరును. మనకిద్దరూ అమ్మాయిలే. నేను అడవుల గురించి కాదు, ఆభరణాల గురించి మాట్లాడుతున్నాను. వాళ్ళిద్దరికీ చెరోటీ, నాకు చెరో రెండూ వడ్డాణాలు, కాసులపేర్లూ చేయించండి. ఇది నా మొదటి వరం. వాళ్ళిద్దరినీ ఆ దిక్కుమాలిన స్కూళ్ళల్లోంచి తీసి ప్రైవేటు స్కూళ్ళల్లో వెయ్యండి. ఇది నా రెండో వరం. ఓ ఫైవ్ డెవిల్స్ లారా, ఓ బ్రయాన్ లారా, ఓ లారా దత్తా, మీరంతా సాక్ష్యం.." అనేసి నా నెక్స్ట్ డైలాగ్ కోసం చూస్తోంది ఓపికగా.

నాకు న్యాయానికి హార్ట్ ఎటాక్ రావాలి. అయితే అది రాంగ్ రూట్లో వెళ్ళి నెక్స్ట్ కోలనీలో ఎవడినో ఢీకొట్టింది. వాడి హంస ఫ్లై అయిపోయింది. నాకు నోట మాట రావట్లేదు. ఎప్పటికో తేరుకుని అన్నాను

"కానీ, ఇప్పటికిప్పుడు అంత డబ్బెక్కడ తెద్దామే? టైము కి ఇంట్లో ప్రింటర్ కూడా పనిచేయట్లేదు" అన్నాను ఆందోళనగా.

"అబ్బా, మీకన్నీ నేనే చెప్పాలి. హైదరాబాదులో భూమి అమ్మేద్దాం" అంది మెల్లిగా.

"ఎవరిదీ?" అని అడిగాను ఇంకా మెల్లిగా.

"ఎవరిదేవిటి, మీదే" అంది కొంచెం చిరాగ్గా.

"నాకు హైదరాబాదులో భూమి వుందా? ఎక్కడే?" అన్నాను అమితాశ్చర్యంగా.

"అదేమిటీ, మీరు పెళ్ళయ్యాకా తొల్నాటి రాత్రి చెప్పారు కదా, మహేస్సరీ పరమేస్సరీ సినిమా హాలు పక్కన మాకు కొంచెం లాండ్ వుందని" అంది అనుమానంగా.

"అదా, అప్పుడు, అప్పుడప్పుడూ అవసరంకోసం ఫ్లోలో అలా అలా ఏవో సర్దాకి అంటూవుంటాం. అన్నీ పట్టించుకోకూడదు కాంతం" అన్నాను అనునయిస్తూ.

"అయితే మీకు భూమి లేదా?" అంది ఆందోళనగా.

"అంటే, టెక్నికల్ గా చూస్తే వుండేది. అది ఎంత అంటే, నీకు ఎలా చెప్పనూ...ఆ, నీకు మహాభారతం తెలుసా?" అన్నాను ఫేసు ఇంటరెస్టింగ్ గా పెట్టి.

"ఆ తెలుసు" అంది ఆవిడ తరువాత ఏమి చెబుతానో అని చూస్తూ.

"దాంట్లో ధర్మ రాజు అండ్ కంపెనీ ఐదూళ్ళు అడిగితే దుర్యోధనుడు జాటర్ రీఫిల్ కింద పడేసి, అక్కడ పడ్డ చుక్క చూపించి, ఇహ్హి హ్హి, ఇంత పిసరు కూడా ఇవ్వనోచ్ అన్నాడు కదా, అంత లాండ్ వుండేదన్నమాట. అదికూడా పదేళ్ళక్రితం ఎవరో అక్యుపై చేసేసి ఫైవ్ స్టోరీ జాటర్ రీఫిల్ బిల్డింగ్ కట్టేసుకున్నాడు. ఇప్పుడు మనం వెళితే బెడ్డిచ్చుక్కొడతాడు.." అన్నాను బెంగగా.

"అయితే మరి ఆభరణాలు చెట్టెక్కేసినట్టేనా?" అంది బుంగమూతి పెట్టి.

"అంటే, ఎక్కినట్టే. ఏక్చువల్గా జమ్మి చెట్టెక్కినట్టన్నమాట. పాండవులంతా తమ ప్రాపర్టీఅంతా మూటకట్టి జమ్మి చెట్టుమీద పెట్టారు చూడు. అల్లాగన్నమాట. మనకి కూడా అజ్ఞాతం తీరిపోగానే, అన్నీ కొనేసుకుని, జాటర్ ఢమాల్ అనేయచ్చన్నమాట." అన్నాను నమ్మకంగా.

"మరైతే పిల్లల చదువు సంగతైనా చూస్తారా?" అంది ఆందోళనగా.

"ఆమాటన్నావు. హం ఆలోచిస్తా హై. జరూర్ ఆలొచించ్ కే, ఎక్ నిర్ణయ్ లేతా హై. లేతాకా, ఐ మీన్ లేచాకా తుంకో బోల్తా హై" అనేసి అటు తిరిగి గుర్రుపెట్టేసాను.

"ఏం బోల్తా నో, ఇలాగే మాటలతో బోల్తా కొట్టించండి, ఆనక వాళ్ళు డబ్బూ లేక, చదువూ రాక, మననే పోలతారు. ఆనక మీ ఇష్టం" అనేసి మెల్లిగా నిష్క్రమించింది. ఇప్పుడు ఓ మూడు గెంటలు కథ రాయడం ఆపబడును. తిరిగి లేచాకా రాయబడును.

మూడు గంటల తరువాత...

"రామూ కాకా, చాయ్ లావ్..." అని గెట్టిగా అరుస్తూ లేచి, నేనే గబగబా కిందకెళ్ళి "జీ సాబ్, అభ్భీ లారూ.." అనేసి టీపెట్టుకుని తాగేసాను. మళ్ళీ కథలోకొద్దాం.

ఆ, ఇంక మిగిలింది పిల్లల చదువు. దాని గురించి ఆలోచిస్తూండగానే, భూమికి సరిగ్గా రెండు గుప్పిళ్ళ ఎత్తులో ఒక మూడేళ్ళ శాల్తీ అటూ ఇటూ తిరిగి ఆడుకుంటోంది.

దాన్ని పిలిచి "ఒసేయ్ బుడింగీ, ఇవాళ స్కూల్లో ఏంచెప్పారే" అన్నాను సరదాగా.

"వెదర్ ఈజ్ సన్నీ" అంది నవ్వుతూ.

"వెరీ గుడ్, మరి టుమారో?" అన్నాను ఆసక్తిగా.

"వెదర్ ఈజ్ రెయినీ" అంది కళ్ళింత చేసి.

"నువ్వు టూమచ్చే. మరి డే అఫ్టర్ టుమారో నో ?" అన్నాను రెట్టిస్తూ.

"వెదర్ ఈజ్ సన్నీ" అంది పళ్ళు చూపిస్తూ.

నాకెందుకో డౌటొచ్చింది. వానపడితే రెయినీ, లేకపోతే సన్నీ. ఈ సింపుల్ లాజిక్ తెలుసుకోలేక, నేను పిచ్చి హేపీ అయిపోయానేంటబ్బా అని డౌటొచ్చింది. అయినా సరే, ఏదో ఒకటి నేర్పారుకదా వాళ్ళు. "ఇంత చదువు చెప్పే స్కూల్ని ఎంత అండరెస్టిమేటేస్తోంది మా ఆవిడ" అనుకుని, విధి వక్రించి దాన్ని ఇంకో ప్రశ్న వేసాను.

"ఒసేయ్ ప్రణవీ, నీ పేరు స్పెల్ చెయ్యండం చెప్పారా?" అన్నాను ఆసక్తిగా.

"యా, బట్ అయాం బిజీ నౌ" అంది ఆడుకుంటూ.

నాకు దాని బిజీ నెస్ చూసి గుండె చెరువైపోయింది.

అయినా తమాయించుకుని అడిగాను "మా తల్లికాదూ, ఒక్కసారి చెప్పవే" అని.

"ఓకే. కానీ ఓన్లీ వన్ టైం. "పి", "ఆర్", "ఏ", "టి", "ఎన్" ప్రణవి..." అంది చెక్క గుర్రం మీద ఊగుతూ.

నాకు కాలేయం నోట్లోకొచ్చింది ఒక్కమాటు. అర్జెంటుగా పిల్లనైనా మార్చేయాలి, స్కూలైనా మార్చేయాలి, ఏది కరెక్టా అని ఆలోచిస్తూండగా పెద్ద శాల్తీ ఇలా కనిపించి, అలా గరుత్మంతుడిలా లేప్టాప్ నోటితో అందుకుని, రూం లోకి దూరి, ఢమాల్ అని తలుపేసుకుంది.

నేను "తెర తీయరా తిరుపతీ దేవరా" అనే టైపులో వందసార్లు మొరపెట్టుకున్నాకా రూం తలుపు కాస్త తెరుచుకుంది.

లోపలికెళ్ళి చూసాను. అది ఏదో ప్రాజెక్టు చేస్తోందిట.

"ఏం ప్రాజెక్టే?" అని అడిగాను.

"హౌ టు గెట్ మేక్సిమం డొనేషన్స్ ఇన్ సమ్మర్ వెకేషన్ ఫర్ చారిటీ?" అంది తడుముకోకుండా.

"ఏముందీ, ఏ నిమ్మరసమో, నారింజ రసమో అమ్మండి, కార్లు కడగండి, గడ్డి కోయండి" అన్నాను సింపుల్ గా.

"నాన్నా, అవి అందరూ చేస్తారు. అన్ని చేసినా మహా వస్తే వంద డాలర్లొస్తాయి. నాకు వెయ్యిడాలర్లు చెయ్యాలని వుంది. అందుకే ఈ ప్రాజెక్టు. సపోజ్ నీదొకటి, అమ్మదొకటి కిడ్నీ అమ్మేసాం అనుకో, సపోజ్.." అంటూ మొదలెట్టి, దాని ప్రెజెంటేషన్ స్లైడ్లు చూపించింది. దానిలో, శరీరంలో రెండు రెండు వున్న వాటన్నిటికీ ఒక వెల నిర్ణయించబడి, ఏది అమ్మితే ఎంత లాభమో రాసి వుంది. నాకు వెన్నులోంచి వణుకొచ్చింది.

దానికి సాష్టాంగ నమస్కారం చేసి, "ఒసేయ్, ఇవి నీ ఐడియాలా, నిజం చెప్పు" అన్నాను ఆల్మోస్ట్ ఏడుస్తూ.

"లేదు నాన్నా, ఇవి నా ప్రాజెక్ట్ టీం లో వున్న జేసన్, గ్రేస్ చెప్పారు. నా ఐడియా కళ్ళు డొనేట్ చెయ్యడం అన్నమాట" అంది అనునయిస్తూ.

"నా తల్లే. బతికించావు. నామాట విని ఏ గాలిపటాలో, కత్తి పడవలో తయారుచేసుకునే ప్రాజెక్టులు చెయ్యవే. నీకు వెయ్యే కదా కావలసింది. నేను సింగిల్ చెక్కు రాసిస్తాను. ఇలా జనాల మూత్ర పిండాలూ, పెద్ద పేగులూ అమ్మేయకే బాబూ.. మీ చదువులు సంతకెళ్ళా, మీ ప్రాజెక్టులు పాడుగానూ.." అనేసి కిందకొచ్చి పెద్ద చెంబుడు చల్లని మంచినీళ్ళు తాగాను సోఫాలో కూలబడి. ప్రాణం లేచొచ్చింది.

మా ఆవిడకూడా లేచొచ్చింది. "చూసారా, మన స్కూళ్ళ సంబడం. అందుకే ఆ తనీషా వాళ్ళ స్కూల్లో వెయ్యండి పెద్దదాన్ని. అది గిఫ్టెడ్ అండ్ ఎక్స్ట్రాడినరీ ప్రైవేట్ సైన్స్ ఎకాడమీ లో చదువుతోంది. దానిలో వేస్తే అందరూ ఐనిస్టీన్ మదర్ హజ్బెండ్స్ లాగ తయారవుతారుట." అంటూ వుండగానే తనీషా వాళ్ళ నాన్న తానీషా గాడి ఫోను. హిందీ లో వాడు కూసిన దానికి తెలుగు సారాంశం ఏవిటంటే మరో రెండు నిమిషాల్లో వాళ్ళ ఆవిడ, సదరు తనీషా ని తీసుకుని మాయింటికి తగలడుతోందిట దాని ప్రాజెక్టు నిమిత్తమై. ఏవో దిక్కుమాలిన కుక్కీలు అమ్ముతోందిట. అదీ సమ్మరీ. నాకు నవ్వొచ్చింది. "చూసావా, మన అండర్ ట్రీ (చెట్టుకింది) స్కూలే నయం. పిల్లలు హ్యూమన్ అనాటమీ మీద ఎలా డబ్బులు సేకరించచ్చో నేర్చుకుంటున్నారు. వేల డబ్బులుపోసి చదివించే ఆస్కూలు చూడు, ఇంకా కుక్కీలు అమ్ముకుంటోంది" అన్నాను గర్వంగా బనీను లేబిల్ ఎగరేస్తూ. ఇంతలో తనీషా వచ్చింది.

"అంకుల్, ఈ పది కుక్కీలు ఇరవై డాలర్లు. మీరు తీసుకోవాలి. ఇది ఫలానా చారిటీకి" అని ఏవేవో కార్డులు చూపించింది.

మనకి 18 ఫాంటు కన్నా తక్కువలో వుంటే ఆట్టే కనిపించదు కాబట్టి "వోఖే, వోయస్", అనేసి కుక్కీ పేకెట్ తీసుకుని, దానికి ఇరవై సమర్పించాను."

"యు ఈట్ అంకుల్" అంది ముద్దుగా.

బావుందని అలా విలాసంగా ఓ కుక్కీ తీసి నోట్లో వేసుకున్నాను. చెప్పకపోడవే, బావుంది.

అప్పుడు చెప్పింది "అంకుల్, ఈ కుక్కీలో రెండు జెనిటికల్లీ మోడిఫై చేసిన ఐటెంస్ వున్నాయి, ఒకటి కుక్కది, ఒకటి పందిది. ఒకవారం తరువాత మీ కుడిచెవ్వి చిన్నగా అయిపోతే పంది జీన్ డామినెంట్ అన్నమాట, మీ నాలుక సాగిపోతే కుక్క జీన్ డామినెంట్ అన్నమాట. లెటజ్ సీ, సీ యు ఇన్ వన్ వీక్, డైలీ ఈట్ వన్ కుక్కీ ఆఫ్టర్ డిన్నర్" అనేసి వెళిపోయింది వాళ్ళమ్మతో.

నాకు దడ పట్టుకుంది. " వీళ్ళ సైన్సు తగలెయ్య. ఆ ముక్క నేను నోట్లో ముక్క వేసుకోకముందు కదా చెప్పాలి. ఇప్పుడు వచ్చే వారాంతానికి నేను కుక్కనౌతానో, పందినౌతానో, వారి దేవుడోయ్, ఇవేం చదువుల్రా నాయనోయ్. " అని భోరున విలపిస్తూంటే మా ఆవిడ తరుణోపాయం చెప్పింది

"మరేం ఖంగారు లేదండీ, దీనికి విరుగుడు కుక్కీలు నటాషా దగ్గిరున్నాయిట, దానికో యాభై ఇచ్చి అది కూడా ఓ ముక్క కొరకండి, సరైపోతుంది" అంది ఆశగా.

నేను బేలగా ఓ నవ్వు నవ్వి, మా ఆవిణ్ణి దగ్గరిగా తీసుకుని, ఆవిడ మంగళ సూత్రాలని కళ్ళకద్దుకుని ముద్దెట్టుకున్నాను భక్తిగా..

COMMENTS